క్లుప్తంగా

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


హోమంలో పాల్గొన్న భక్తులు

మహేశ్వరం: కాటమయ్య స్వామి, సురమాంభ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు జల్‌పల్లిలో ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం విగ్రహాలను ఊరేగించారు. మంగళవారం హోమం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ పూజా కార్యక్రమాలు కొనసాగాయి. బుధవారం ఉదయం విగ్రహాల ప్రతిష్ఠాపన జరగనుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నర్సింగ్ గౌడ్, రాజేష్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఆటపాటలతో వీఓఏల నిరసన


బతుకమ్మ ఆడుతున్న వీఓఏలు

కందుకూరు: సమస్యల పరిష్కారం కోరుతూ సీఐటీయూ మండల కన్వీనర్ బాలరాజు, వీఓఏల సంఘం మండల అధ్యక్షురాలు సరస్వతి ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వీఓఏలు సమ్మె చేశారు. కార్యక్రమంలో భాగంగా బతుకమ్మ ఆటపాటలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమ డిమాండ్లు నెరవేర్చే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. సమ్మెకు వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు కృష్ణయ్య మద్దతు తెలిపారు. కార్యక్రమంలో వీఓఏలు హైమావతి, రజిత, పద్మ, జయ, మాధవి, రజిత, సంగీత, లావణ్య, జ్యోతి, దేవి పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు


ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు

తుక్కుగూడ: సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. అమ్మవారికి ఇష్టమైన రోజు మంగళవారం కావడంతో భక్తులు ఉదయం నుంచే ఆలయానికి బారులు తీరారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు, కానుకలు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేశారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు, పూజారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గోశాల ప్రారంభం


గోశాల ప్రారంభిస్తున్న రామనుజ జీయర్

తుక్కుగూడ: జిన్నాయిగుట్ట లక్ష్మీ నృసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూడో రోజైన మంగళవారం యాగాలు, దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన గోశాలను అహోబిల రామానుజ జీయర్ స్వామి ప్రారంభించారు. ఆలయ చైర్మన్ శివశంకర్, పూజారులు అజయ్‌శర్మ, మురళీ, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా మక్సూద్ అలీ


నియామక పత్రం అందజేస్తున్న రాంరెడ్డి

వనస్థలిపురం: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం ఎల్‌బీనగర్ అధ్యక్షుడిగా వనస్థలిపురం ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన మహమ్మద్ మక్సూద్ అలీ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ మైనార్టీ విభాగం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎంజీ జహంగీర్ (రియాజ్) ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన నియామక పత్రాన్ని మక్సూద్ అలీకి పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ కన్వీనర్ మల్‌రెడ్డి రాంరెడ్డి అందజేశారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

- ముస్తాబైన లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం
- నాలుగు రోజుల పాటు ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు


ముస్తాబైన చెన్నకేశవస్వామి ఆలయం


లక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి

కందుకూరు: మండలంలోని ఊట్లపల్లి పరిధిలో దేవుని గుట్టపై కొలువుదీరిన లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు జరగనున్నట్లు నిర్వాహకుడు లక్ష్మయ్య ముదిరాజ్ మంగళవారం తెలిపారు. 4వ తేదీ మధ్యాహ్నం 1.05 గంటలకు గణపతి పూజ, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, కంకణ ధారణ, ధ్వజారోహణం, అంకురారోహణం, అఖండ దీపారాధన, యజ్ఞ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. 5వ తేదీ స్వామివారి తిరు కల్యాణోత్సవం, 6న హోమాలు, పూర్ణాహుతి, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, 7న అమ్మవారికి బోనాలు, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు పూర్తవుతాయని తెలిపారు. భక్తులు ఆయా రోజుల్లో జరిగే ఉత్సవాల్లో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

‘కంటివెలుగు’ను సద్వినియోగం చేసుకోండి


కంటి పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

మీర్‌పేట: కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మీర్‌పేట కార్పొరేషన్ 31వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం జనప్రియ మహానగర్‌లో ఏర్పాటు చేసిన కంటి శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ నెల 8 వరకు శిబిరం కొనసాగుతుందని, కంటికి సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే.. పరీక్ష చేసి, అవసరమైన వారికి వైద్యులు కళ్లద్దాలు, మందులు పంపిణీ చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ స్రవంతి, బాలాపూర్ యూపీహెచ్‌సీ సూపర్‌వైజర్ కమలకుమారి, బీఆర్‌ఎస్ నాయకులు రాజు పాల్గొన్నారు.

సోషల్ మీడియా రాష్ట్ర కో-కన్వీనర్‌గా శివకుమార్



మహేశ్వరం: బీజేవైఎం సోషల్ మీడియా రాష్ట్ర కో-కన్వీనర్‌గా మండలంలోని దుబ్బచర్ల గ్రామానికి చెందిన ఎం శివకుమార్ నియమితులయ్యారు. మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్ శివకుమార్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరవేసి చైతన్య పరుస్తానని తెలిపారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని ఆరోపించారు. వాటిని ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో ఎండగడతానని తెలిపారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్, జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదిష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తెగని పంచాయితీ!

నందనవనం ఇళ్ల కోసం ఇరువర్గాల మధ్య రగడ

- ఆక్రమణదారులు, లబ్ధిదారుల మధ్య గొడవ
- ఎమ్మెల్యే హామీ ఇచ్చినా కొనసాగుతున్న ఆందోళన


బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని నందనవనం కాలనీలో పేదల కోసం నిర్మించిన జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ఇళ్ల మంజూరు వ్యవహారం జఠిలంగా మారింది. ప్రభుత్వం 512 ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేయగా.. రెండేళ్ల క్రితం స్థానికంగా ఉండే కొందరు పేదలు తాళాలు పగులగొట్టి వాటిలో నివాసం ఉంటున్నారు. అయితే.. ప్రభుత్వం నిజమైన లబ్ధిదారులను గుర్తించి, ఒక్కొక్కరి దగ్గర రూ.86 వేలు తీసుకొని వారికి గతంలోనే ఇళ్లు కేటాయించింది. వారు ఆ ఇళ్లలోకి వెళ్లేందుకు నందనవనం కాలనీకి రాగా.. ఆక్రమణదారులు వారిని రానీయకుండా అడ్డుకున్నారు. దీంతో ఆక్రమణదారులు, ప్రభుత్వం ఎంపిక చేసిన లబ్ధిదారుల మధ్య ఘర్షణలు, ధర్నాలతో ఇళ్ల సమస్య తెగని పంచాయితీగా మారింది. స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి జోక్యం చేసుకొని ఇరు వర్గాలను పిలిపించి న్యాయం చేస్తానని సర్దిచెప్పినా కూడా ఎవరూ వినిపించుకోవడం లేదు. అసలైన లబ్ధిదారులు పోలీస్‌స్టేషన్, మండల రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతుండటం అటు అధికారులకు, ఇటు ప్రజాప్రతినిధులకు తలనొప్పిగా మారింది.

పదేళ్ల క్రితం నిర్మాణం..

- పదేళ్ల క్రితం 512 గృహాలు నిర్మించిన ప్రభుత్వం అందులో 87 ఇళ్లను కొందరు లబ్ధిదారులకు అప్పట్లోనే కేటాయించింది. మిగిలిన 315 ఇళ్లలో నిరుపేదలు అక్రమంగా నివాసం ఉంటుండగా, 110 ఇళ్లలో స్థానికంగా ఉంటున్న ఓ వర్గం వారు అక్రమంగా ఉంటున్నారు.
- ఇదే ఇళ్లను నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన పేదలకు కేటాయిస్తూ ప్రభుత్వం ధ్రువ పత్రాలు అందజేసింది. అప్పటికే ఈ 425 ఇళ్లలో నివాసం ఉంటున్న వారు ఖాళీ చేసేది లేదని స్పష్టం చేయడంతో ఇళ్ల కేటాయింపు పత్రాలు అందుకున్న అసలైన లబ్ధిదారులు ఆ ఇళ్లను స్వాధీనం చేసుకోలేక పోయారు.
- ఆ ఇళ్లలో అక్రమంగా ఉంటున్న వారికి నగరంలోని ఇతర ప్రాంతాల్లో గృహాలు ఇవ్వాలని నిర్ణయించిన అధికారులు.. 2022 అక్టోబర్ 12న 285 కుటుంబాలకు డ్రా పద్ధతిలో ఇళ్లను కేటాయించారు. వారికి కేటాయించిన ఇళ్లన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయని, తాము అక్కడకు వెళ్లలేమని వారు నిరాకరించారు.
- ఈ నేపథ్యంలో కొంతకాలంగా ఆక్రమణదారులు, లబ్ధిదారులకు మధ్య ఘర్షణ జరుగుతోంది. ఇరువర్గాల వారు ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో మధ్యేయ మార్గంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆక్రణదారులను అక్కడే ఉంచి.. అసలైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయిస్తామని చెప్పారు. ఈ ప్రతిపాదనకు అప్పట్లో ఒప్పుకున్న లబ్ధిదారులు.. తమకు ఇళ్లు కేటాయించాలంటూ ఇటీవల రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

ఇరు వర్గాలకు న్యాయం చేస్తాం

నందనవనం కాలనీలో నివాసం ఉంటున్న ఆక్రమణదారులకు, ప్రభుత్వం కేటాయించిన అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. గతంలో ఇక్కడ గుడిసెలు వేసుకుని జీవించిన వారికి అన్యాయం జరిగింది. ఇరువర్గాల సమస్యను ఇటీవల మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లా. ఇరువురూ నిరుపేదలే కావడంతో వారికి న్యాయం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. దీంతో లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని నిర్ణయం తీసుకున్నాం. ఎవరికీ అన్యాయం జరగకుండా ఇరువర్గాలకు న్యాయం చేస్తాం. దళారుల మాటలు నమ్మి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు.

– దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే

క్రమబద్ధీకరించే వరకు విశ్రమించం


అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న జేపీఎస్‌లు

కందుకూరు: క్రమబద్ధీకరించే వరకు విశ్రమించేది లేదని, ఉద్యమాన్ని ఆపేది లేదని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు స్పష్టం చేశారు. సమ్మెలో భాగంగా మంగళవారం కందుకూరు, మహేశ్వరం, కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లి మండలాలకు చెందిన జేపీఎస్‌లు, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. వీరికి ఎంపీడీఓ వెంకట్‌రాములు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్ ముదిరాజ్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సంఘం కందుకూరు డివిజన్ అధ్యక్షుడు ఎండీ జావిద్, మండల అధ్యక్షుడు మురళీమోహన్, ఆయా మండలాల అధ్యక్షులు రాము, శివకుమార్, వాజిద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పోరాటాలతోనే హక్కులు


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న పారిశుద్ధ్య కార్మికులు

హస్తినాపురం: తమ హక్కుల సాధన కోసం కార్మికులు వీరోచిత పోరాటం చేశారని, ఆ పోరాటాల ఫలితంగానే ప్రపంచ కార్మిక వర్గానికి కొన్ని హక్కులు దక్కాయని జీహెచ్‌ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్య అన్నారు. మంగళవారం సీఐటీయూ ఎల్‌బీనగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో మేడే వారోత్సవాల సందర్భంగా హస్తినాపురంలోని అనుపమా నగర్ కాలనీలో జీహెచ్‌ఎంసీ కార్మికులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ, మే ఒకటవ తేదీ నుండి 6వ తేదీ వరకు మేడే వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, ప్రతిరోజూ ఆటపాట కార్యక్రమాలు నిర్వహిస్తూ 6న ఆటోనగర్‌లో ముగింపు సభ నిర్వహిస్తామన్నారు. భవన నిర్మాణ కార్మికులు, జీహెచ్‌ఎంసీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కార్మికులు లత, జి.పున్నమ్మ, ఎం.భాగ్యమ్మ, దండు అంజమ్మ, శంకరమ్మ, అరవిందు, శ్రీనివాస్, ధనుంజయ, చంద్రమ్మ, అంజమ్మ, యాదమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులు ఆటపాటల్లో ముందుండాలి



శిబిరంలో మాట్లాడుతున్న పాపిశెట్టి రాము

ఆమనగల్లు: విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలలోనూ ముందుండాలని ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము అన్నారు. మాడ్గుల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శృతిలయ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించే ఉచిత శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. విద్యార్థులు జీవన నైపుణ్యాలతో పాటు నైతిక విలువల ప్రాధాన్యత గురించి తెలుసుకోవాలని సూచించారు. శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇందులో వివిధ పాఠ్యాంశాలతో పాటు నృత్యాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, యోగాసాధన చేయిస్తామని ఆయన వివరించారు. కార్యక్రమంలో శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్‌దాస్, సలహాదారులు తిరుపతిగౌడ్, విష్ణు, మహేశ్, జంగయ్య, ఆంజనేయులు, శిబిరం ఇన్‌చార్జిలు రవీందర్, సునీత, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీల పాత్ర కీలకం

- ఒక్క కెమెరా వంద మంది పోలీసులతో సమానం
- ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్


మాట్లాడుతున్న ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్

కడ్తాల్: నేర రహిత సమాజ నిర్మాణంలో సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయని, వాటి ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ అన్నారు. మంగళవారం జీపీ కార్యాలయంలో సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి అధ్యక్షతన సీసీల ఏర్పాటుపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంతో పాటు, జాతీయ రహదారిపై కెమెరాలు అమర్చేందుకు ప్రత్యేక దృష్టి సారించామని, వాటి ఏర్పాటుకు స్థానికులు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. కెమెరాల ఏర్పాటుతో నేరాలను అదుపు చేయడంతో పాటు, దొంగతనాలు నివారించడానికి దోహదపడతాయని చెప్పారు. ఏవైనా సంఘటనలు జరిగినప్పుడు సమాచార సేకరణకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఒక్క కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, అందుకే సీసీల ప్రాధాన్యత గుర్తించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీఓ మధుసూదనాచారి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణ, వర్తక సంఘం అధ్యక్షుడు ఆసిఫ్‌అలీ, సంఘం గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు పెంటారెడ్డి, లక్ష్మీనారాయణ, జహంగీర్‌అలీ, మహేశ్, చంద్రయ్య, రాజేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ల దూకుడు!

నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై ఆర్టీసీ డ్రైవర్ల దూకుడుకు ప్రయాణికులు, వాహనదారులు హడలిపోతున్నారు. వారి నిర్లక్ష్య డ్రైవింగ్ ఎప్పుడు ఎవరి ప్రాణాలను హరిస్తుందోనని భయాందోళన చెందుతున్నారు. సంస్థ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా.. అందులో మార్పేమీ రానట్లు జరుగుతున్న రోడ్డు ప్రమాదాలే సాక్ష్యమని పరిసర ప్రాంత ప్రజలు వాపోతున్నారు.

- వాయువేగంతో దూసుకెళ్తున్న బస్సులు
- ఆందోళన చెందుతున్న ప్రయాణికులు
- భయాందోళనకు గురవుతున్న వాహనదారులు
- ప్రశ్నిస్తే ప్రయాణికులపై డ్రైవర్ల తిరుగుబాటు
- ఫిర్యాదు చేసినా ఫలితం లేదంటున్న ప్రజలు


సాగర్‌రోడ్డుపై కొద్దిరోజుల క్రితం బస్సు నిలిపి ఆందోళన చేస్తున్న ప్రయాణికులు

యాచారం: నల్లగొండ జిల్లా దేవరకొండ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులు సాగర్‌రోడ్డుపై దేవరకొండ–హైదరాబాద్‌కు సాగర్ రహదారిపై నిత్యం 50 సర్వీసుల వరకు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. వాటి పరుగులే ప్రజల ప్రాణాల మీదకు తెస్తోందని ప్రత్యక్ష సాక్షులు స్పష్టం చేస్తున్నారు. అందుకు కారణం ఆ డిపోకు చెందిన డ్రైవర్లే అని, వారి దూకుడుపై సంస్థ అధికారులకు చెప్పినా.. పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. వారి తీరుపై గతంలో పలుమార్లు ప్రయాణికులు సాగర్‌రోడ్డుపై మాల్, యాచారం, గునుగల్, ఆగాపల్లి, ఇబ్రహీంపట్నం తదితర కేంద్రాల్లో ధర్నాలు, రాస్తారోకోలు చేశారు.

ప్రమాదాలకు నెలవు..

డీవీకే ఆర్టీసీ డిపో సర్వీసులతో సాగర్‌రోడ్డు ప్రమాదాలకు నెలవుగా మారింది. నిత్యం ఏదో ఒక చోట ఎదురుగా వచ్చే వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రెండు నెలల వ్యవధిలో 20కి పైగా యాక్సిడెంట్లు జరిగినట్లు సమాచారం. దీనిపై డ్రైవర్లను పలువురు బాధితులు ప్రశ్నించగా.. ‘మేము గిట్లనే బస్సులను నడుపుతం. ఎదురుగా వస్తుంటే మీరే జాగ్రత్తగా రావాలి’ అని దురుసు సమాధానం ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు. రెండు రోజుల కిందట యాచారం మండల కేంద్రంలో ఉదయం 7 గంటలకు ప్రయాణికుడు చేయి ఎత్తినా బస్సును నిలపకపోగా.. బాటసారుల మీదకే బస్సును తీసుకెళ్లి భయపెట్టినట్లు పలువురు పేర్కొన్నారు. తాజాగా మంగళవారం సాగర్‌రోడ్డుపై దేవరకొండ ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో ఓ ప్రయాణికుడు అక్కడికక్కడే మృతి చెందాడు.

మండల కేంద్రమైనా..

దేవరకొండ నుంచి సాగర్‌రోడ్డుపై యాచారం మండల కేంద్రం ఉంది. అయినా అక్కడ డీవీకే బస్సులు నిలపడం లేదు. ఇదే విషయమై పలుమార్లు ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా.. ఆర్టీసీ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ అశోక్‌రాజును సంప్రదించగా.. ‘సాగర్‌రోడ్డుపై దేవరకొండ ఆర్టీసీ బస్సులు వేగంగా వెళ్తున్నట్లు ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు అందాయి. తాజాగా గురునానక్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద బస్సు ఢీకొని ఓ ప్రయాణికుడు మృత్యువాత పడ్డాడు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా’ అని ఆయన చెప్పారు.

ఆపినా ఆగవు..



యాచారం మండల కేంద్రం నుంచి తరచూ నగరానికి బస్సుల్లోనే వెళ్లి వస్తుంటాము. సాగర్‌రోడ్డుపై రాకపోకలు సాగించే దేవరకొండ బస్సులు.. చేయి ఎత్తినా ఆగవు. ఒక్కోసారి వాటి వేగం మమ్మల్ని భయాందోళనకు గురిచేస్తుంది. పలుమార్లు సంస్థ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం. అయినా స్పందన లేదు.

– వెంకటరెడ్డి, ప్రయాణికుడు, యాచారం

అతి వేగంగా..



సాగర్‌రోడ్డుపై దేవరకొండ బస్సులు వాయువేగంతో దూసుకెళ్తుంటాయి. ఎదురుగా వస్తున్న వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాహనం నడపాల్సి ఉంటుంది. నిత్యం బీఎస్‌రెడ్డి నగర్‌కు కారులో వెళ్లి వస్తుంటాను. పలుమార్లు కళ్లెదుటే ప్రమాదాలు జరిగాయి.

– జుట్టు శ్రీశైలం, చౌదర్‌పల్లి

సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలి

మంచాల: ప్రభుత్వ సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని అభ్యున్నతి పొందాలని మంచాల పశు వైద్యాధికారి సుధారెడ్డి చెప్పారు. మంగళవారం జన జాగృతి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ప్రభుత్వం నాబార్డు సహకారంతో రైతులకు అందజేస్తున్న సేవలను గుర్తు చేశారు. రైతులకు బ్యాంకుల ద్వారా సబ్సిడీపై రుణాలు ఇస్తున్నారని, పట్టణ ప్రాంతంలో 10 శాతం, గ్రామీణ ప్రాంతంలో 35 శాతం రాయితీపై పలు రకాల రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంస్థ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, గ్రామ కో–ఆప్షన్ సభ్యుడు బాలరాజ్, డైరెక్టర్లు శ్రీశైలం, శ్రీనివాస్, కిషన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సీఈఓ సరిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

6న సర్వసభ్య సమావేశం

తలకొండపల్లి: ఈ నెల 6వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ నిర్మల మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు జరగనున్న సమావేశానికి వివిధ శాఖల మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.